పోస్టాఫీసుకు మోక్షం ఎప్పుడో ?

- సొంత భవనం లేక ఇబ్బందులు
- నిరుపయోగంగా రూ.కోట్లు విలువ చేసే స్థలం

చింతలపూడి: పోస్టాఫీసు స్థలానికి మోక్షం ఎప్పుడని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న రూ.కోట్లు విలువ విలువ చేసే స్థలం ప్రస్తుతం ముళ్లతుప్పలు, చెత్త, చెదారంతో నిండిపోయి నిరుపయోగంగా పడి ఉంది. గతంలో సంబంధిత అధికారులు దీన్ని శుభ్రం చేయించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆలనా, పాలనా లేకుండా పడి ఉండటంతో చుట్టుపక్కల నివాసం ఉండే వారు చెత్త, చెదారం ఈ స్థలంలో పోయడంతో నిత్యం దుర్గంధం వెదజల్లుతుంది. ఇక్కడి పోస్టాఫీసుకు స్థానిక ఆశ్రమం వీధిలో సుమారు 12 సెంట్ల స్థలం ఉంది. సుమారు రూ.2 కోట్లకు పైగా విలువ చేసే స్థలం నిరుపయోగంగా ఉంది. చాలా కాలంగా ఈ స్థలంలో పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు. అయితే పోస్టల్ శాఖ నిధులు కేటాయించకపోవడం కారణంగా భవన నిర్మాణం జరగలేదు. దీంతో నెలకు వేలల్లో అద్దె చెల్లించి, ఏళ్ల తరబడి పోస్టాఫీసును అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. దీంతో ఈ పోస్టాఫీస్ పరిధిలో పని చేస్తున్న గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోస్టల్ శాఖ కళ్లు తెరిచి సొంత భవనానికి నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.


అద్దె భవనంలో కొనసాగుతున్న చింతలపూడి పోస్టాఫీసు


ఆలనా పాలనా లేక నిరుపయోగంగా ఉన్న పోస్టాఫీసు స్థలం

సొంత భవనం నిర్మించాలి



పోస్టల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలి. చాలీచాలని భవనంలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో అనేక సార్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రం కూడా అందించాం. పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు శాశ్వత భవనానికి నిధులు కేటాయించాలి.

నరం లెనిన్‌బాబు, రాష్ట్ర బీసీ సంఘర్షణ సమితి ఉపాధ్యక్షుడు, చింతలపూడి

క్లుప్తంగా

విద్యుత్ కాంతులతో పట్టిసం శివ క్షేత్రం


విద్యుత్ కాంతులతో మెరిసి పోతున్న పట్టిసం శివ క్షేత్రం

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల ప్రసిద్ధి చెందిన పట్టిసం శివ క్షేత్రం విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. కార్తీక మాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు నిత్యం క్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని క్షేత్రపాలకుడైన భావన నారాయణ స్వామిని దర్శించుకుంటున్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన


కార్తీక వన భోజనాలు చేస్తున్న ప్రజలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శివారులోని హర్షవనంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్యవైశ్యులు ఉసిరి చెట్టు వద్ద దామోదర పూజను నిర్వహించారు. అనంతరం వనసమారాధనను ప్రారంభించారు. ఇందులో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కార్తీక మాసం రెండో మంగళ వారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలలో అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆడమిల్లి విద్యార్థి ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థిని

కామవరపుకోట: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చెంచల గుణ ప్రవల్లిక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భూక్య విజయభారతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అండర్–17 విభాగం రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో గుణ ప్రవల్లిక విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యిందని ఆమె తెలిపారు. విద్యార్థినిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మానకొండ సుబ్బారావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించారు.

బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

జంగారెడ్డిగూడెం: తల్లితండ్రులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించి బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి అన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో బ్యూలా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వీఆర్వో, కార్యదర్శి, మహిళా సంరక్షణ అధికారి, పాఠశాల హెచ్ఎంలు, అంగన్‌వాడీ టీచర్‌లు, సర్పంచ్‌లతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తే బాల్య వివాహాలను అరికట్టొచ్చన్నారు. కిషోర బాలికలకు వివాహలు చేస్తే ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డాక్టర్ సూర్య చక్రవేణి

కార్యక్రమంలో డీఎల్‌డీవో రాజు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, జలస్థాయి సోషల్ వర్కర్ రాజేష్, రాజ కుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్‌లు, పంచాయతీ సెక్రటరీలు మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చాలి

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని, సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలోని సీపీఐ కార్యాలయం వద్ద మండల నాయకుల సమావేశం వెలగల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. జమ్మి శ్రీనివాసరా వు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తుందని ఆరోపించారు. సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, మహిళా నాయకురాలు ఎల్లిబోయిన లక్ష్మి, షేక్ సైదాని, చల్లా బాబురావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎన్నికల హామీలు అమలు చేయాలి

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. మంగళ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులు, గిరిజన సబ్‌ప్లాన్ నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం, పరిహారం ఇవ్వడంలో లేదన్నారు.

మద్ది ఆదాయం రూ.5.89 లక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు, కార్తీక మంగళ వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రాతఃకాలార్చన, తోమాలసేవ నిర్వహించి, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.5,89,107 ఆదాయం వచ్చినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో సుమారు 20 వేల మందికి రాజమండ్రికి చెందిన కోనేరు మురళి దంపతులు, మహంకాళి రంగప్రసాద్, లక్కవరం ఆర్యవైశ్య సంఘం వారిచే అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో తెలిపారు. జువ్వాది కృష్ణ, కూరగంటి రంగారావు పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.


భక్తులతో కోలాహలంగా మారిన మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రచారోద్యమ కార్యక్రమాలు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ ధరల విపరీతంగా పెరుగుతున్నాయని, పెట్రోల్, డీజిల్, రిటైల్ ధరల పెరుగుదలకు అంతు లేదన్నారు. నిరుద్యోగ సమస్య తీరడం లేదని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస కాలనీల అభివృద్ధికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయపి విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్నం సాయికిరణ్, మహబూబ్ పాషా,పుల దాసు రమేష్,భయ్యాన శ్రీను,షేక్ వలిపాషా తదితరులు పాల్గొన్నారు.


ప్రచారోద్యమ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా మంగళవారం రూ. 3,50,121 లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తూర్పు విప్పర్రుకు చెందిన వానపల్లి బాలాజీ రూ. 2,50,116 లను, తాడేపల్లిగూడెంకు చెందిన సీహెచ్ హరిప్రసాద్ రూ. 1,00,005 లను ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటిండెంట్ హయగ్రీవాచారి విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

కేసుల పరిష్కారానికి రాజమార్గం లోక్‌అదాలత్

చింతలపూడి: కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ రాజమార్గమని లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధక్షుడు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

దివ్యాంగులకు చేయూత

కొయ్యలగూడెం: స్థానిక కన్నాపురం రోడ్డులోని ఎంపీ యూపీ స్కూల్లో నిర్వహిస్తున్న భవిత వికలాంగ పిల్లల (దివ్యాంగుల) పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, పెన్నులు, పలకలు, క్రీడా సామగ్రి సుమారు రూ.3 వేల విలువైనవి అందజేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: చింతలపూడిలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం పాతిమాపురం గ్రామంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో బొర్రా నాగమణి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె నుండి 5 మద్యం సీసీలు 3 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అనంతరం మహిళను తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి బైండోవర్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీఎల్ నరసింహారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మంగళ వారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సర్కిల్ పరిధిలోని జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలో 400 లీటర్ల బెల్లపు ఊటను, కుక్కునూరు మండలం మారేడుబాకలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే కుక్కునూరు మండలంలోని మారేడుబాకలో నాటు సారా అమ్ముతున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా, వింజరం గ్రామంలో 5 లీటర్ల నాటుసారాతో మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కేఎండీ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

బుట్టాయగూడెం: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఎస్సీ కంపోనెంట్ బడ్జెట్ గత ప్రభుత్వం కంటే తక్కువగా కేటాయించి, దళితులకు అన్యాయం చేసిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో అన్నారు. బడ్జెట్‌లో చంద్రన్న పెళ్లి కానుక నిధులు కేటాయింపు లేదని ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి సంబంధించి కేంద్రం నుంచి వచ్చే నిధులతో సర్దుబాటు చేశారే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్రంలో 17 శాతం దళితులు ఉండగా ఆ మేరకు దామాషాగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సరైనది కాదన్నారు. ఇది దుర్మార్గమైన కుల దురంకార చర్యని విమర్శించారు.

ఉపసభాపతిగా దాసరోజు


నియామక పత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ఉప సభాపతిగా డాక్టర్ దాసరోజు నియమితులయ్యారు. మంగళవారం విజయవాడలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల విశ్వబ్రాహ్మణ ఉమ్మడి సమావేశంలో అసోసియేషన్ పెద్దలు నియామక పత్రాన్ని అందజేశారని దాస రోజు కొయ్యలగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. దార్ల రాంబాబు, ఉపాధ్యక్షులు పెద్దోజు శ్రీనివాసాచార్యులు, కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, కోశాధికారి కోటిపల్లి నాని, బ్రహ్మజీ, గుండేపల్లి చిన్నా, తదితర సంఘ సభ్యులు దాసరోజుకు అభినందనలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కొయ్యలగూడెం: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీల గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఆధ్యాత్మిక ప్రముఖులైన మంతెన నరసింహరాజును కోరారు. మంగళవారం కొయ్యలగూడెంలో నరసింహరాజును సత్కరించారు.

ఉద్యాన పంటలపై అవగాహన

లింగపాలెం: మండలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, చింతలపూడి సహాయ సంచాలకులు బి.నాగకుమార్‌లు మండలంలోని తోచలకరాయుడు పాలెం, నరసన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, అపరాలు వేసుకోవాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాన్ని సిద్ధంగా ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు.


వర్జీనియాపై అవగాహన సమావేశం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు పంట నియంత్రణ అవగాహన సమావేశం మంగళ వారం వేలం కేంద్రంలో నిర్వహించారు. వేలం నిర్వహణ అధికారిని గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాజమండ్రి రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ హాజరయ్యారు. పొగాకు పంటను నిర్ణీత కోటా మేరకే పండించాలని, పరిమితికి మించి పొగాకు పండిస్తే నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ఇంకా రైతులు పొగాకు చవుడు నేలల్లోనూ, పల్లపు భూముల్లోనూ పొగాకు పండించకూడదని సూచించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ నాణ్యమైన పొగాకు పండించాలని పురుగుమందుల అవశేషాలు లేని పొగాకుకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని తెలిపారు. పొగాకు రైతు సంఘం అధ్యక్షులు కాకర్ల వివేకానంద, పొగాకు రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ ప్రసాద్

గిట్టుబాటు ధర కల్పించాలి


కుక్కునూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి ప్రభుత్వాన్ని కోరారు. కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ గిట్టుబాటు ధరతో పాటు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి అన్ని విధాలా ఆదుకుని ప్రతి రైతుకు రూ.20 వేల సహాయాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మడకం మంగ, వి.రాంబాబు, మడివి జోగేశ్, రవ్వ గంగరాజు, వరసా నరసింహారావు, కల్లూరి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎఫ్ఆర్ఎస్‌పై ఉద్యోగుల నిరసన

వేలేరుపాడు: ఎఫ్ఆర్ఎస్‌ను ప్రభుత్వం ఉద్యోగుల మీద బలవంతంగా ప్రయోగిస్తుందని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాముల దొర అన్నారు. వేలేరుపాడులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం పాటించడం లేదని జీతాల మీద కొత్త విధిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనే తేడా లేకుండా జీతాలు కట్ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విధానాన్ని మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలవుతుందని హెచ్చరించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

శివాలయాల్లో ఏకాదశి పూజలు

కుక్కునూరు: కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కుక్కునూరు శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, మాధవరం కౌండిన్య ముక్తేశ్వరాలయం, పెదరావిగూడెం శ్రీ కేదారేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. కుక్కునూరు శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

సత్యదేవుడి ఆలయంలో ఏకాదశి వ్రతాలు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురం లోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం ఏకాదశి కావడంతో పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించారు. ఈ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతీ కార్తీకమాసంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి సత్యదేవుడి వ్రతాలు నిర్వహిస్తారు. ఈ మేరకు భక్తులకు ఆలయ గుమస్తా గోపి తగిన ఏర్పాట్లు, సదుపాయాలను కల్పించారు.


ఏకాదశి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కామవరపుకోట: గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని శాఖాగ్రంథాలయ నిర్వాహక కమిటీ చైర్మన్ షేక్ ఇబ్రహీం అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఎమ్ భీమరాజు, నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షులు కొండూరు రామకృష్ణ, కార్యదర్శి వీరమల్ల మధు, కోశాధికారి టీవీఎస్ రాజు, బొల్లు వెంకటేశ్వరరావు, మేడంకి రాజారావు, వంగల శ్రీనివాసరావు, నిజాపరపు దుర్గాప్రసాద్, గేరీకల వెంకట్ పాల్గొన్నారు.


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి పి.దుర్గారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే వారోత్సవాలను జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, తహసిల్దార్ కె.స్లీజో జిలు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాలు వారం రోజులు విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, స్కిప్పింగ్, క్విజ్, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించబడునని తెలిపారు.